TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 55 | బుధవారం 22-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతివ్వండి

**కోదండరాంకు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ లేఖ**

**బీఆర్ఎస్ ఓ దండుపాళ్యం ముఠా: చామల**

**హైదరాబాద్, బేగంపేట, అక్టోబరు 21:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంకు టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్ గౌడ్ మంగళవారం లేఖ రాశారు. 22 నెలలుగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతోందని, ఈ తరుణంలో ఉప ఎన్నిక అత్యంత కీలకంగా మారిందన్నారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్‌ను ఓడించడం కాంగ్రెసను గెలిపిచడం అందరి బాధ్యతని తెలిపారు. నవీన్ యాదవ్‌కు టీజేఎస్ తరపున సంపూర్ణ మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో సోమవారం దీపావళి వేడుకలు చేసుకున్నారు.

## కాంగ్రెస్ హయాంలో 80 వేల ఉద్యోగాలు

**యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం**

**సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో 25న మెగా జాబ్‌మేళా**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హుజూర్‌నగర్, అక్టోబరు 21:**
కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 80 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈనెల 25న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ తేజ్‌సనందలాల్ పవార్, ఎస్పీ నర్సింహతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టిసారించామన్నారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకుల కోసం హుజూర్‌నగర్‌లో 205 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటివరకు 9,500 మంది యువకులు ఉపాధి కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

# మావోయిస్టులు లొంగిపోవాలి

## జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి




**రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావం తగ్గిపోయింది**

**పోలీసుల అజేయ స్ఫూర్తికిది నిదర్శనం**

**పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

**కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం.. 300 గజాల ఇంటి స్థలం**

**ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**

**పోలీస్ అమరవీరులకు సీఎం నివాళి**

**ప్రజలతోనే ఫ్రెండ్లీ పోలీసింగ్.. నేరస్థులతో కాదు: డీజీపీ శివధర్‌రెడ్డి**

**హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21:**
మావోయిస్టులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోవాలన్నారు. ఇటీవల అనేక మంది అగ్రనేతలు లొంగిపోయిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం గతంలో మావోయిస్టులు, తీవ్రవాద కార్యకలాపాలతో బాధపడిందని చెప్పారు. ఇటీవలి కాలంలో ఉగ్రవాదం, నక్సల్స్ ప్రభావం వేగంగా తగ్గుముఖం పట్టాయన్నారు. రాష్ట్ర పోలీసుల అజేయ స్ఫూర్తికి ఇది నిదర్శనమని తెలిపారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని, అమరులకు నివాళులు అర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నక్సల్స్ ముప్పును రూపుమాపడంలో తెలంగాణ పోలీసులు చేసిన కృషిని అభినందించారు. మావోయిస్టులు లొంగిపోయి, సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఎంతోమంది పోలీసులు దేశం కోసం ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. పోలీసులంటే సమాజానికి ఒక నమ్మకం అని.. పగలు రాత్రి తేడాలేకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తారని తెలిపారు. ఈ ఏడాది దేశంలో 191 మంది పోలీసులు అమరులయ్యారని, వారిలో తెలంగాణకు చెందిన ఆరుగురు పోలీసులు ఉన్నారని సీఎం వెల్లడించారు. గ్రేహౌండ్స్ కమాండోలు టి.సందీప్, వి.శ్రీధర్, ఎన్.పవన్‌కల్యాణ్, అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్‌లాల్, నల్లగొండ కానిస్టేబుల్ బి.సైదులు, తాజాగా నిజామాబాద్‌లో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఓదార్చారు. పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. వీరమరణం పొందిన పోలీసులకు రాష్ట్ర ప్రజల తరపున శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. ప్రమోద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి నిర్ణయించినట్లు సీఎం చెప్పారు. అదనంగా పోలీస్ సెక్యూరిటీ వెల్ఫేర్ నుంచి రూ.16 లక్షలు, పోలీస్ వెల్ఫేర్ నుంచి రూ.8 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం, పోలీస్ శాఖ అండగా ఉంటుందని చెప్పారు. 2008లో ఒడిసాలో మావోయిస్టులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన 33 మంది పోలీస్ అమరులకు గాజులరామారంలో 200 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడంతో పాటు ప్రత్యేకమైన ప్రజా సంక్షేమ విధివిధానాలను అనుసరించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇండియా జస్టిస్ రిపోర్టు ప్రకారం.. తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. పారదర్శకత, పాస్‌పోర్టు తనిఖీల్లో అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. ఈ విజయాలు రాష్ట్ర పోలీసుల నిరంతర కృషికి, అంకిత భావానికి నిదర్శనమని అన్నారు. పోలీస్ శాఖలోనూ మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ మహమ్మారిపై ఈగల్ (తెలంగాణ నార్కోటిక్ బ్యూరో) పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి రావడం, సోషల్‌మీడియా ప్రభావం పెరగడంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్ణయమైనా తీసుకునేలా పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చామని చెప్పారు.

**ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని దానం..**

## కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినరా?!

**దమ్ముంటే రాజీనామా చేసి.. ఉప ఎన్నికలో గెలవాలి: కేటీఆర్**

**రేవంత్..నయా నరకాసురుడు: హరీశ్**



**హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21:**
ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని దానం నాగేందర్‌ను స్టార్ క్యాంపెయినర్‌గా పెట్టుకోవడం కాంగ్రెస్ దిక్కుమాలిన రాజకీయాలకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేను స్టార్ క్యాంపెయినర్‌గా ఎలా నియమిస్తారని కాంగ్రెసను నిలదీశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు దమ్ముంటే పదవికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ తరపున నిలబడి గెలవాలని సవాల్ విసిరారు. బస్తీ దవాఖానల నిర్వాహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజారోగ్యాన్ని విస్మరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖానను ఆయన సందర్శించి, రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి బస్తీ దవాఖానాల్లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్లు కూల్చడం తప్ప చేసిందేమీ లేదని, ఇది ఆగాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెసను ఓడించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నయా నరకాసురుడి అవతారమెత్తారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్ పాలకుల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు.

## ఆ మూడు పార్టీలూ ఒక్కటే

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి నామినేషన్ దాఖలు**



హైదరాబాద్ అక్టోబరు 21
కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటేనని జూబ్లీహిల్స్ ప్రజలు ఓటుతో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటేనని ఆరోపించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మజ్లిస్ పార్టీ, అసదుద్దీన్ ఒవైసీ మద్దతు ఉందన్నారు. మజ్లిస్ కబంధ హస్తాల నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాలన్నారు. నాడు కేసీఆర్ మజ్లిసను తన భుజాల మీద మోసారని, నేడు కాంగ్రెస్ కూడా అదే చేస్తోందని ధ్వజమెత్తారు. ఆ మూడు పార్టీలు స్వార్థం కోసమే పని చేస్తాయని ఆరోపించారు. బీఆర్ఎసకు ఓటు వేస్తే అది మూసీ నదిలో వేసినట్టేనని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌ను సింగపూర్, వాషింగ్టన్ చేస్తానని చెప్పి ఇప్పుడు ఫామ్‌హౌసలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వీధి దీపాలు ఏర్పాటుకూ ఇబ్బంది పడుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెసకు జూబ్లీహిల్స్‌లో ఓటు అడిగే హక్కు లేదన్నారు.

# వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు

**మావోయిస్టు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం..పదేళ్ల కిందట 125 జిల్లాల్లో .. ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితం: ప్రధాని మోదీ**

**ఆపరేషన్ సిందూర్‌తో పాటు ఇదీ గొప్ప విజయమే**

**మన భద్రతా బలగాలకు సెల్యూట్**

**ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి దీపావళి వేడుకలు**



**పణజీ, అక్టోబరు 21:** దేశంలో నక్సల్-మావోయిస్టు ఉగ్రవాదం నిర్మూలనలో తుది అంకంలో ఉన్నామని ప్రధాని మోదీ అన్నారు. భద్రతాదళాలు 90 శాతం వరకు విజయం సాధించాయని.. వందకుపైగా జిల్లాలకు దీని నుంచి విముక్తి కల్పించాయని చెప్పారు. ఆయా జిల్లాల ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ దీపావళి జరుపుకొంటున్నారని అన్నారు. సదరు ఉగ్రవాదం ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితమైందని తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని ఆయన గోవా తీరంలో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి పండుగ జరుపుకొన్నారు. భద్రతాదళాల ధైర్యసాహసాలను కొనియాడారు. మావోయిస్టుల ఉగ్రవాదంపై కీలక విజయాలు సాధించాయన్నారు. '2014కి ముందు దాదాపు 125 జిల్లాలు మావోయిస్టుల గుప్పిట్లో ఉండేవి. గత దశాబ్ద కాలంగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో 11 జిల్లాలకు తగ్గిపోయింది. వీటిలో కూడా మూడు జిల్లాల్లోనే మావోయిస్టుల ప్రాబల్యం ఉంది. వారి నుంచి విముక్తి పొందిన వందకుపైగా జిల్లాలు తొలిసారి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాయి. 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' కారణంగా ఈ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఈ జిల్లాల్లో భారత రాజ్యాంగం పేరెత్తితేనే అణచివేసేవారు. ఇప్పుడక్కడ స్వదేశీ మంత్రం ప్రతిధ్వనిస్తోంది' అని చెప్పారు. దేశంలో అంతర్గతంగా యుద్ధం చేయాలంటే ఎంతో సహనం అవసరమని, అమాయకులెవరూ చనిపోకుండా చూసుకోవలసి ఉంటుందని గుర్తుచేశారు. తమ ప్రాబల్య ప్రాంతాల్లో స్కూళ్లు, రోడ్లు, ఆస్పత్రులను నిర్మించడానికి నక్సల్స్ అనుమతించలేదని.. వాటిని పేల్చేసి డాక్టర్లను కాల్చిచంపారని తెలిపారు. ఇప్పుడవే ప్రాంతాల్లో హైవేలు నిర్మిస్తున్నామని.. స్కూళ్లు, ఆస్పత్రులు పిల్లలకు నూతన భవిష్యత్‌ను ఇస్తున్నాయని చెప్పారు. భద్రతాదళాల త్యాగాలు, ధైర్యసాహసాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ పోరులో అవయవాలు కోల్పోయి వీల్‌చైర్లకే పరిమితమైనా పోలీసు జవాన్లు పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినం సందర్భంగానూ.. ప్రాణత్యాగాలు చేసిన పోలీసులకు మోదీ నివాళులు అర్పించారు. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్.. 'ఆత్మనిర్భర భారత్'కు తిరుగులేని నిదర్శనమని ప్రధాని తెలిపారు. దీనిని కదులుతున్న నగరంగా అభివర్ణించారు. 'త్రివిధ దళాల మధ్య అద్భుత సమన్వయం.. మన నౌకాదళం చొప్పించిన భయం.. వైమానిక దళ అసాధారణ నైపుణ్యం, సైన్యం సాహసం.. కలగలిపి 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి తీసుకొచ్చాయన్నారు. 'కొన్నేళ్లుగా భారత దళాలు స్వావలంబనతో అత్యాధునికత సంతరించుకున్నాయి. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు తమ సామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్‌లో నిరూపించుకున్నాయి. పలు దేశాలు ఇప్పుడీ క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి. గత 11 ఏళ్లలో మన రక్షణ ఉత్పత్తులు మూడు రెట్లు పెరిగాయి. గత ఏడాది ఈ ఉత్పత్తులపై వ్యయం రూ.లక్షన్నర కోట్లకు చేరుకుంది. 2014 నుంచి వివిధ భారత షిప్‌యార్డులు నౌకాదళానికి 40 స్వదేశీ యుద్ధనౌకలు, జలాంతర్గాములను నిర్మించి ఇచ్చాయి. అంటే సగటున ప్రతి 40 రోజులకు ఓ యుద్ధనౌక, జలాంతర్గామి నిర్మించాయన్న మాట. ప్రపంచ అగ్ర రక్షణ ఉత్పత్తిదారుల్లో ఒకరిగా నిలవాలన్నది భారత లక్ష్యం' అని స్పష్టంచేశారు.

## పత్తి రైతులను ఆదుకుంటాం

**తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు: పొంగులేటి**

**పాలేరు సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి**



హైదరాబాద్, కూసుమంచి, అక్టోబరు 21
ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకుంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం గోల్‌తండలో 2025 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీసీఐ తొలి కేంద్రాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సీజన్‌లో భారీ వర్షాల వల్ల రైతులకు దిగుబడి తగ్గిపోయిందన్నారు. సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. గిట్టు బాటు ధర అందించేందుకు, మద్దతు ధర పెంచేలా రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ద్వారా చర్చకు పెడతామన్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభు త్వం ఉపేక్షించదన్నారు. ప్రతి సీసీఐ కేంద్రం వద్ద వచ్చే అభ్యంతరాలను పరిష్కరిం చేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తా మన్నారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే స్థానిక కమిటీలు చర్యలు తీసుకుంటా యని హెచ్చరించారు. వ్యవసాయ అధికా రుల వద్ద తేమ యంత్రాలు ఉన్నాయని, రైతుల పొలాల వద్దనే తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జూబ్లీహిల్స్‌లో భారీగా నామినేషన్లు

**హైదరాబాద్ అక్టోబరు 21 :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన మంగళవారం ఒక్కరోజే 160 మందికిపైగా నామినేషన్లు వేశారు. ఈ నెల 13న నామినేషన్ల స్వీకరణ మొదలవగా 18 వరకు 94 మంది అభ్యర్థులు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఆదివారం, దీపావళి పండుగతో రెండు రోజులు సెలవు దినాలు కావడంతో నామినేషన్ల స్వీకరణ జరగలేదు. చివరి రోజైన మంగళవారం అభ్యర్థులు పోటెత్తారు. పలు అంశాల విషయంలో ప్రభుత్వంపై నిరసన తెలిపే వేదికగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను వినియోగించుకుంటున్నారు. అయితే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నామినేషన్ల దాఖలుకు అవకాశముండటం, అభ్యర్థులు పెద్దసంఖ్యలో రావడంతో అధికారులు టోకెన్ విధానం ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసేవారికి ముందు టోకెన్ ఇచ్చి.. అనంతరం నామపత్రాలు స్వీకరించారు. 188 మందికి టోకెన్లు ఇచ్చారు. రాత్రి 12 గంటల వరకు 160 నామినేషన్లు దాఖలు కాగా, ఆ తరువాత కూడా ప్రక్రియ కొనసాగింది. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 250కి పైగా నమోదయ్యే అవకాశం ఉంది. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), ఫార్మాసిటీ భూనిర్వాసితులు, నిరుద్యోగులు ఉన్నారు. ఫార్మాసిటీ కారణంగా భూములు కోల్పోతున్న రైతులు ఎన్నికల కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. 11 మంది రైతులు నామినేషన్‌లు వేశారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయిన రైతులు కూడా



మూకుమ్మడిగా నామినేషన్లు వేసేందుకు వచ్చారు. కాగా, ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల సంఘాల జేఏసీ నుంచి 30 మంది నామినేషన్‌లు వేశారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సమితి నుంచి 11 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. భారీగా నామినేషన్లు దాఖలు కావడం ప్రధాన పార్టీలకు వణుకు పుట్టిస్తోంది. ఎక్కువ మంది బరిలో ఉంటే.. వారికి ఏ గుర్తులు కేటాయిస్తారు, ఆ ప్రభావం ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నామినేషన్ల పరిశీలన బుధవారం జరగనుంది. 24 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశముంది. అభ్యర్థుల సంఖ్య 63 దాటితే బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం వర్గాలు పేర్కొన్నాయి. ఒక కంట్రోల్ యూనిట్ 4 బ్యాలెట్ యూనిట్లను సపోర్ట్ చేస్తుంది. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో 16 చొప్పున 64 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయి. నోటా మినహాయిస్తే.. 63 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశమున్న దృష్ట్యా.. అంతకంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే బ్యాలెట్ పోరు తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఒక భారతీయుడిని, చైనీయుడిని నమ్మవద్దు

**ట్రంప్ నామినీ జాతి వివక్ష వ్యాఖ్యలపై దుమారం**

**కీలక పదవికి నామినేట్ అయిన పాల్ ఇంగ్రేసియా పాత గ్రూప్ చాట్ లీక్**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక పదవికి నామినేట్ చేసిన వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. జాతి వివక్షతో కూడిన ఆయన పాత వ్యాఖ్యలు ఇప్పుడు బయటకు లీక్ కావడంతో, సెనేట్‌లో ఆయన నియామకం దాదాపు అసాధ్యంగా మారింది. ఆఫీస్ ఆఫ్ స్పెషల్ కౌన్సిల్ అధిపతిగా ట్రంప్ నామినేట్ చేసిన పాల్ ఇంగ్రేసియా, గతంలో చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. పొలిటికో వార్తా సంస్థ బయటపెట్టిన వివరాల ప్రకారం, పాల్ ఇంగ్రేసియా రిపబ్లికన్లతో జరిపిన ఒక గ్రూప్ చాట్‌లో అనేక వివాదాస్పద విషయాలు వెల్లడయ్యాయి. 2024 మే నెలలో జరిగిన ఒక చర్చ సందర్భంగా, ఒక సభ్యుడు ఇంగ్రేసియాను 'హిట్లర్ యూత్' అని వ్యాఖ్యానించగా, దానికి ఇంగ్రేసియా బదులిస్తూ, "అవును, అప్పుడప్పుడు నాలో నాజీ భావాలు బయటకు వస్తుంటాయి. అది నేను ఒప్పుకుంటాను" అని చెప్పడం సంచలనం సృష్టిస్తోంది. అంతేకాకుండా, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామిని ఉద్దేశించి, "ఒక చైనీయుడిని గానీ, భారతీయుడిని గానీ ఎప్పటికీ నమ్మవద్దు" అని కూడా ఇంగ్రేసియా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్‌ను అవమానిస్తూ కూడా ఇంగ్రేసియా వ్యాఖ్యానించారు. "మార్టిన్ లూథర్ కింగ్ 1960ల నాటి జార్జ్ ఫ్లాయిడ్. ఆయన పేరిట ఇచ్చే సెలవును రద్దు చేసి పారేయాలి" అని ఆయన అన్నారు. నల్లజాతీయులను ఉద్దేశించి ఒక జాత్యహంకార పదాన్ని వాడుతూ.. వారికి సంబంధించిన ఏ సెలవు దినం కూడా ఉండకూడదని, అన్నింటినీ నాశనం చేయాలని డిమాండ్ చేశారు. శ్వేత జాతీయుల ఆధిపత్యాన్ని సమర్థిస్తూ, "నాయకత్వ స్థానాల్లో సమర్థులైన శ్వేత జాతీయులు ఉండాలి. మనుషులందరూ సమానమేనన్న మన పూర్వీకుల ఆలోచన తప్పు. దానిని మనం తిరస్కరించాలి" అని ఇంగ్రేసియా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సెనేట్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సెనేట్ మెజారిటీ లీడర్ జాన్ థూన్ మాట్లాడుతూ "ఆయన నియామకం జరగదు. వైట్‌హౌస్ ఈ నామినేషన్‌ను వెనక్కి తీసుకుంటుందని ఆశిస్తున్నాను" అని స్పష్టం చేశారు. పలువురు రిపబ్లికన్ సెనేటర్లు సైతం ఇంగ్రేసియా నియామకాన్ని వ్యతిరేకిస్తుండటంతో, కీలక పదవికి ఆయన ఎంపిక దాదాపుగా ముగిసినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# శ్రీరాముడే స్ఫూర్తిగా 'ఆపరేషన్ సింధూర్'



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
న్యూఢిల్లీ : దీపావళి పండుగ సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని, కొన్ని నెలల క్రితం చేపట్టిన లిలి'ఆపరేషన్ సింధూర్'లిలికు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నామని ఆయన తెలిపారు. "అయోధ్యలో రామాలయ నిర్మాణం తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధిస్తాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. మనం చేపట్టిన ఆపరేషన్ సింధూరే ఇందుకు ఉదాహరణ. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతోపాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేక మంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారు. దేశానికి ఇది ఒక గొప్ప విజయం" అని మోదీ తన లేఖలో రాశారు.

**ప్రజలకు మోదీ పిలుపు**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించడం వల్ల ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుతుందని ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, అన్ని భాషలను గౌరవించాలని, ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే, మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి, యోగాను ఆచరిద్దామని కోరారు. ఈ ప్రయత్నాలన్నీ దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.


# దీపావళి ప్రభావంతో ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి చేరిన వాయు కాలుష్యం

**పౌరులకు అనారోగ్య సమస్యలు**





**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు ఆందోళనకర స్థాయికి పడిపోతున్నది, ముఖ్యంగా దీపావళి వేడుకల అనంతర పరిణామంగా ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. పండుగ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున పటాకులు కాల్చడం, పొరుగు రాష్ట్రాల్లో వ్యవసాయ వ్యర్థాలను దహనం చేయడంతో పాటు నిర్మాణ వ్యర్థాలు కూడా తోడ్కె దేశ రాజధానిని దట్టమైన పొగ, కాలుష్యంతో నింపేశాయి. మంగళవారం ఉదయం 7 గంటల సమయానికి గాలి నాణ్యత సూచీ 347 పాయింట్లకు పెరగడంతో, ఢిల్లీ గాలి నాణ్యత 'వెరీ పూర్' కేటగిరిలో కొనసాగుతున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడిరచింది. ఈ స్థాయి కాలుష్యం చాలా ప్రమాదకరమని, ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారికి, చిన్నారులకు ఇది మరింత హానికరం అని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నిజానికి, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది, అక్కడ గాలి నాణ్యత సూచీ ఏకంగా 491గా నమోదైంది. ఈ తీవ్ర కాలుష్యం ప్రభావంతో ఢిల్లీ వాసులు కళ్లు, ముక్కు, గొంతులో మంట, దురద వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, వైద్య నిపుణులు ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం పూట ఆరుబయట తిరగవద్దని, తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సూచించారు. దీపావళి సందర్భంగా కాల్చిన పటాకులు, పంటల వ్యర్థాలు దహనం చేయడమే ఈ కాలుష్యానికి ప్రధాన కారణమని పీసీబీ అధికారులు స్పష్టం చేశారు, దీనికి తోడు నగరంలోని భారీ నిర్మాణ వ్యర్థాలు కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. పర్యావరణ హితమైన పటాకులు కాల్చేందుకు సుప్రీం కోర్టు అనుమతినిచ్చినప్పటికీ, టపాసులు కాల్చడానికి నిర్దేశించిన సమయాన్ని ప్రజలు పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాయస్థానం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సోమవారం సాయంత్రం ఢిల్లీ ప్రజలు పెద్దఎత్తున పటాకులు కాల్చడంతో ఆదేశాలను ఉల్లంఘించారు. దీని కారణంగా రాత్రికి రాత్రే గాలి నాణ్యత మరింత క్షీణించింది, అనేక ప్రాంతాలు రెడ్ జోన్ పరిధిలోకి చేరాయి. ఢిల్లీలోని వివిధ ప్రాంతాలలో నమోదైన కాలుష్య గణాంకాలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. వాజీపూర్‌లో గాలి నాణ్యత సూచీ 435గా నమోదవగా, ద్వారకా 422, అశోక్ విహార్ 445, ఆనంద్ విహార్ 440 పాయింట్లుగా నమోదైంది. ఈ ప్రాంతాలన్నీ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ జోన్'లో కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణవేత్తలు, నగర పౌరులు కోరుకుంటున్నారు. లేనిపక్షంలో, రాబోయే రోజుల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



## జపాన్ కొత్త ప్రధానికి మోదీ శుభాకాంక్షలు

**భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం లక్ష్యం**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
న్యూఢిల్లీ : జపాన్ నూతన ప్రధానమంత్రిగా సనే తకాయిచి ఎన్నికైన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తకాయిచితో కలిసి పనిచేసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్-జపాన్ బంధాన్ని మరింత బలోపేతం చేద్దామని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ తన పోస్ట్‌లో భారత్, జపాన్ మధ్య ఉన్న 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అలాగే ప్రపంచవ్యాప్తంగా శాంతి, సుస్థిరత, శ్రేయస్సును నెలకొల్పడంలో ఇరు దేశాల బంధం అత్యంత కీలకమని ఆయన నొక్కి చెప్పారు.మోదీ సందేశం యథాతథంగా: "జపాన్‌కు నూతన ప్రధానిగా ఎన్నికైన మీకు హృదయపూర్వక అభినందనలు సనే తకాయిచి. భారత్-జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నా.ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అదేవిధంగా ఈ ప్రాంతానికి వెలుపల శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు నెలకొన డంలో ఇరుదేశాల బంధం కీలకపాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో దీపావళి సంబరాలు

**ప్రధాని షెహబాజ్ షరీఫ్ నివాసంలో ప్రత్యే విందు**



ఇంటర్నెట్ డెస్క్: పాకిస్తాన్‌లో హిందూ సమాజం దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంది. దీపావళి వేడుకల సందర్భంగా ఆ దేశ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తన నివాసంలో ఒక ప్రత్యే విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ, క్రైస్తవ సభ్యులతో పాటు ఇతర మతాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ స్వయంగా దీపావళి కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన హిందూ సమాజానికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల పట్ల పాకిస్తాన్ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తుందనడానికి నిదర్శనంగా ఈ వేడుక నిలిచింది. ప్రస్తుతం ఈ వేడుకలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ప్యాసింజర్ రైలులో మైనర్‌పై అనుచిత ప్రవర్తన

**వీడియో వైరల్‌పై నటి రిచా చద్దా ఆగ్రహం**

**అతన్ని ఫేమస్ చేద్దాం, సిగ్గుచేటు" అంటూ ఎక్స్‌లో నటి పోస్ట్**



**తొవ్వ ,ప్రతినిధి, అక్టోబర్ 21:**
ప్యాసింజర్ రైలులో ఒక వ్యక్తి మైనర్ బాలికతో దారుణంగా ప్రవర్తించినట్లు చూపించే వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ షాకింగ్ వీడియోపై బాలీవుడ్ నటి రిచా చద్దా స్పందించారు. ఆ వ్యక్తి నీచమైన ప్రవర్తనను ఖండిస్తూ, రిచా తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) హ్యాండిల్‌లో ఆ వీడియోను తిరిగి షేర్ చేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "అతన్ని ఫేమస్ చేద్దాం. మనమందరం ఇలాంటి చాలా మంది సహ ప్రయాణీకులను కలిశాము. సిగ్గుచేటు" అని రాసుకొచ్చారు. వైరల్ అవుతున్న ఆ వీడియోలో, ఖాళీగా ఉన్న రైలు కంపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తి మైనర్ బాలికకు దగ్గరగా కూర్చుని ఆమెను అనుచితంగా తాకినట్లుగా కనిపిస్తుంది. ఈ షాకింగ్ చర్యను గమనించిన మరొక ప్రయాణీకుడు ఆ దృశ్యాన్ని తన మొబైల్‌లో చిత్రీకరించాడు. మైనర్ బాలికను అనుచితంగా తాకినందుకు తోటి ప్రయాణీకుడు ఆ వ్యక్తిని నిలదీయగా, నిందితుడు తడబడి చర్యను మళ్లించడానికి ప్రయత్నించాడు. ఆ సంభాషణ నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, చివరికి పరోక్షంగా తన తప్పును అంగీకరించాల్సి వచ్చింది. ఈ వీడియోలో కళ్లద్దాలు ధరించిన ఆ వ్యక్తి తన సొంత కూతురిలాంటి బాలిక వద్ద కూర్చుని చాలా అసహ్యకరమైన రీతిలో తాకడానికి ప్రయత్నించాడని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నీచమైన చర్యను అక్కడే ఉన్న ఒక అబ్బాయి ధైర్యంగా వీడియో రికార్డ్ చేయడం ద్వారా బయటపెట్టాడు. వీడియో వైరల్ అయిన వెంటనే, సామాజిక మాధ్యమాలలో నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ఆ వ్యక్తిపై తక్షణమే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# పోలీసుల త్యాగం అజరామరం

**జాతీయ పోలీస్ స్మారకం వద్ద రాజ్‌నాథ్ నివాళి**

**వికసిత భారత్‌కు అంతర్గత భద్రతే కీలకం**

**పోలీస్ సంస్మరణ దినం' సందర్భంగా జాతీయ పోలీస్ స్మారక చిహ్నం వద్ద రాజ్‌నాథ్ సింగ్ ఘన నివాళులు**

**2047 నాటి 'వికసిత భారత్' లక్ష్యం నెరవేరడంలో అంతర్గత భద్రతకు పోలీసులే కీలకం**




**తొవ్వ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతీయ పోలీస్ సంస్మరణ దినం సందర్భంగా న్యూఢిల్లీలోని జాతీయ పోలీస్ స్మారక చిహ్నం (నేషనల్ పోలీస్ మెమోరియల్) వద్దకు వెళ్లి దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్, పారామిలిటరీ బలగాల సిబ్బంది అందించిన అత్యున్నత సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రక్షణ మంత్రిగా ఆయన చేసిన ఈ పర్యటన దేశ అంతర్గత భద్రతను పటిష్టం చేయడంలో పోలీసుల త్యాగాలను, నిబద్ధతను గుర్తించినట్లుగా నిలిచింది. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న జరుపుకునే ఈ సంస్మరణ దినం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది ధైర్యశాలులైన పోలీసు సిబ్బందికి నివాళులర్పించేందుకు ఒక ముఖ్యమైన రోజుగా పరిగణించబడుతుంది. పోలీస్, పారామిలిటరీ బలగాల పాత్రను వివరిస్తూ రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక బలగాలు, పోలీసు బలగాలు విభిన్నమైన ప్లాట్‌ఫారమ్‌లలో, వేర్వేరు నిబంధనల ప్రకారం పనిచేసినప్పటికీ, వాటి ప్రధాన లక్ష్యం మాత్రం ఒక్కటేనని, అది దేశాన్ని రక్షించడమేనని ఆయన స్పష్టం చేశారు. బాహ్య శత్రువుల నుండి దేశ సరిహద్దులను సైన్యం కాపాడుతుండగా, అంతర్గత శాంతిభద్రతలు, స్థిరత్వం, పౌరుల భద్రతను పోలీసులు, పారామిలిటరీ బలగాలు నిర్వర్తిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ రెండు వ్యవస్థల మధ్య ఉన్న సమన్వయం, అవి దేశ రక్షణ కోసం చేస్తున్న సమిష్టి కృషి అత్యంత ప్రశంసనీయమని, ఈ రెండు విభాగాలూ ఒకే దేశభక్తితో ముందుకు సాగుతున్నాయని మంత్రి ఉద్ఘాటించారు.రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో వికసిత భారత్ 2047 లక్ష్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని సాధించాలంటే, దేశం యొక్క బాహ్య భద్రతను, అంతర్గత భద్రతను సమతుల్యం చేసుకోవడం గతంలో కంటే ఇప్పుడు మరింత ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ఈ భారీ లక్ష్యం వైపు దేశం అడుగులు వేస్తున్న తరుణంలో, ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో శాంతి, స్థిరత్వం కొనసాగించడం కీలకమన్నారు. ఈ సున్నితమైన మిషన్‌లో పోలీసు, పారామిలిటరీ బలగాలు అత్యంత అంకితభావంతో, నిరంతరం తమ విధులను నిర్వర్తిస్తున్నాయని, దేశ పురోగతికి అవి నిశ్శబ్దంగా మద్దతు ఇస్తున్నాయని ఆయన కొనియాడారు. చివరగా, దేశ అంతర్గత భద్రతను కాపాడుతున్న పోలీసు సిబ్బంది యొక్క త్యాగాలు, సేవలు మరువలేనివని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. తీవ్రవాదం, మావోయిజం, ఇతర అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో పోలీసు బలగాలు ధైర్యసాహసాలను ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ దినోత్సవం సందర్భంగా యావత్ దేశం వారి సేవలను, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని, వారి కుటుంబాలకు మద్దతుగా నిలబడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ చేసిన ఈ నివాళులు, కేంద్ర ప్రభుత్వం దేశ భద్రతా దళాలకు ఇస్తున్న ప్రాధాన్యతను మరోసారి హైలైట్ చేశాయి.

# గ్రామాల నిర్లక్ష్యంతోనే సమస్యలు


దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదు. గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగితేనే జాతీయ అభివృద్ధి సాధ్యమన్న కనీస పరిజ్ఞానం పాలకులకు లేకుండా పోతోంది. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున్న ప్రోత్సహించే కార్యాక్రమాలు చేపట్టడం లేదు. దీంతో ఉద్యోగాల కోసం ప్తి ఒక్కరూ పట్టాణలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందన్నది చాణుక్యుడి కాలం నుంచి అమల్లో ఉంది. చాణుక్యుడు ఈ సూత్రం ఆధారంగానే గ్రామాలను బలోపేతం చేయాలని సూచించారు. ఆయన అర్థ శాస్త్రంలో ఎలాంటి ఆర్థిక వ్యవస్థ అవసరమో సూచించారు. ఎలాగైతే మన ఆర్థిక వ్యవస్థ బలపడుతుందో తెలిపారు. కానీ పాలకులు దానిని పాఠ్యపుస్తకాల్లోంచి తీసేసారు. తమ మెదళ్లోంచి తీసేసారు. దాన్ని అమలు చేయాలన్న విషయాలను మరిచారు. నిజానికి దేశం బాగుడాలంటే గ్రామాలు బలపడాలి. గ్రామాలు ఆర్థికంగా వృద్ది చెందాలి. వ్యవసాయం అందుకు ఆలంబన కావాలి. అన్నదాతలు ఆర్థికంగా బలపడితేనే అనుబంధ రంగాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. అయితే వ్యవసాయికంగా మనం పంటల ఉత్పత్తిలో చూపిస్తున్న శ్రద్ధ వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అన్ని విధాలుగా మనమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఒక్క సూత్రాన్ని పాటిస్తే పంట ఉత్పత్తులతో పాటు..నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడమే గాకుండా... గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడగలం. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. దీనికితోడు గ్రామాల్లో ఏం జరగాల్లో ఇక్కడి నుంచి రిమోట్ ద్వారా నిర్దేశించడం, కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించడం వంటి చర్యల కారణంగా ఇంకా వలసలు పెరిగి పట్టణాలపై ప్రజలు ఆధారపడు తున్నారు. ఈ కారణంగానే గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు రావడం లేదు. ఈ కారణంగానే గ్రామాల్లో కూలీల సమస్య తీవ్రంగా మారింది. గ్రామాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు పట్టణాలకు వలస వస్తున్నారు. దీంతో పట్టణాలపై భారం పడుతోంది. దీనిని ప్రభుత్వాలు గమనించడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థను బలోపే తానికి గ్రామాలు యూనిట్‌గా సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాల అమలు జరగడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎం పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామాలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను మింగుతున్న వైనం సరికాదు. గ్రామాలపై ఇక్కడ పెత్తనం చేయడం వల్ల అవి అభివృద్ధి చెందడం లేదు. గ్రామాలను స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహించాలే తప్ప కర్రపెత్తనం చేయడం సరికాదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేక పోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహి తంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు మొదలు ఇతరత్రా కార్యక్రామలు బలంగా ముందుకు సాగడంలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో లక్ష్యాన్ని సాధించడం లేదు. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. సర్పంచ్‌లకు అజమాయిషీ ఉండాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వంమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. తాజాగా కరోనా ఇంకా విజృంభించడానికి పరిశుభ్రతా లోపం కూడా కారణంగా చూడాలి. కరోనాలాంటి వైరస్‌లను అరికట్టాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు,పొలం ప్రాంతాలు, గ్రామ శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగత మైన శ్రద్దకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కావడం లేదు. కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగునీరు ఎక్కడపడితే అక్కడ వచ్చి చేరుతోంది. పారిశుద్య కార్యక్రమాల్లో ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం తొలిసారిగా ఆర్థిక చేయూత ఇవ్వడం ద్వారా గ్రామాల్లో కొంత మార్పు కనిపిస్తోంది.

# మైనర్లపై స్వల్ప పెనెట్రేషన్ కూడా అత్యాచారమే

**బాంబే హైకోర్టు చారిత్రక తీర్పు**

**వార్ధా జిల్లాలో డ్రైవర్‌కు విధించిన 10 ఏళ్ల జైలు శిక్షను సమర్థించిన నాగ్‌పూర్ బెంచ్**

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
మైనర్లపై లైంగిక దాడి కేసుల విషయంలో బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ తాజాగా ఒక స్పష్టమైన, కీలకమైన తీర్పును వెలువరించింది. బాధితులు మైనర్లు అయినప్పుడు, నిందితుడు స్వల్పంగా చొచ్చుకుపోయినా (స్వల్ప పెనెట్రేషన్) కూడా అది అత్యాచారం కిందకే వస్తుందని న్యాయమూర్తి జస్టిస్ మెహతా స్పష్టం చేశారు. లైంగిక దాడి సందర్భంలో చొచ్చుకుపోయే లోతు అప్రస్తుతమని, మైనర్ల ప్రైవేట్ భాగాలలోకి ఏ శరీర భాగాన్ని చొప్పించినా అది అత్యాచారం లేదా తీవ్రమైన లైంగిక దాడి అవుతుందని తేల్చి చెప్పారు. ఈ తీర్పు వార్ధా జిల్లాలోని హింగాన్‌ఘాట్‌కు చెందిన 38 ఏళ్ల డ్రైవర్ అప్పీల్‌ను తోసిపుచ్చింది, గతంలో ట్రయల్ కోర్టు అతడికి విధించిన 10 సంవత్సరాల జైలు శిక్షను హైకోర్ట్ బెంచ్ సమర్థించింది. ఈ చారిత్రక తీర్పు బాలికలపై లైంగిక దాడులకు పాల్పడేవారికి గట్టి హెచ్చరికగా నిలిచింది.ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే, నిందితుడు 2014లో 5, 6 సంవత్సరాల వయసున్న ఇద్దరు బాలికలకు జామపళ్లు ఇస్తానని ఆశ చూపించి, అశ్లీల వీడియోలను చూపించి లైంగిక వేధింపులకు ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న బాలికల తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ట్రయల్ కోర్టు అతడికి జైలు శిక్ష విధించగా, నిందితుడు ఆ తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో తనను తప్పుడు కేసులో ఇరికించడానికి ప్రయత్నిస్తున్నారని, తాను అత్యాచారానికి పాల్పడినట్టు ఎటువంటి ఆధారాలూ లేవని నిందితుడి తరపు న్యాయవాది వాదించారు. దాడి జరిగిన 15 రోజుల తర్వాత బాలికకు నిర్వహించిన వైద్య పరీక్షలో ఆమె ప్రైవేట్ భాగాలపై ఎటువంటి గాయాలూ లేకపోవడాన్ని కూడా ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.అయితే, ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ మెహతా నిందితుడి వాదనలను తిరస్కరించారు. తప్పుడు కేసులో ఇరికించడానికి ప్రయత్నించారనే వాదనకు ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. అలాగే, ఆలస్యంగా నిర్వహించిన వైద్య పరీక్షలో గాయాలు లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకోలేమని, చిన్న వయసు కారణంగా బాలిక




గాయాలు త్వరగా నయం కావచ్చని జస్టిస్ మెహతా అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, మైనర్లపై లైంగిక దాడి విషయంలో 'పెనెట్రేషన్' అనేది స్వల్పంగా ఉన్నా అది చట్ట ప్రకారం నేరమే అవుతుందన్న విషయాన్ని ఆయన మరోసారి స్పష్టం చేశారు, దీనిని చొచ్చుకుపోయే లోతుతో ముడిపెట్టడం సరైంది కాదని తేల్చిచెప్పారు.ఇదే సమయంలో, ట్రయల్ కోర్టు తీర్పులో జరిగిన ఒక చట్టపరమైన తప్పిదాన్ని కూడా జస్టిస్ మెహతా సరిదిద్దారు. ఈ నేరం ఫిబ్రవరి 19, 2014న జరిగింది. కానీ, ట్రయల్ కోర్టు 2019లో సవరించబడిన పోక్సో చట్టం నిబంధనల ఆధారంగా శిక్ష విధించింది. 2019 నాటి సవరించిన నిబంధన కనీసం 20 సంవత్సరాల జైలు శిక్షను సూచిస్తుంది. అయితే, 2014 నాటి నేరానికి 2019 నాటి సవరించిన నిబంధనలు వర్తించవని జస్టిస్ మెహతా అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ట్రయల్ కోర్టు విధించిన 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష అనేది సవరించని పాత చట్టం సూచించే కనీస శిక్షకు అనుగుణంగా ఉందని, కాబట్టి శిక్షలో ఎటువంటి మార్పు అవసరం లేదని ఆయన పేర్కొంటూ నిందితుడి అప్పీల్‌ను పూర్తిగా కొట్టివేశారు.

# కుమార్తెపై లైంగిక దాడి ఆరోపణ

**యువకుడిని చంపి, మృతదేహాన్ని కాలువలో పడేసిన తండ్రి.. లొంగుబాటు**



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**
ఒడిశాలోని దెంకనల్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. తన కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడనే తీవ్ర కోపంతో ఒక యువకుడిని బాలిక తండ్రి చంపిన సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన దెంకనల్ జిల్లాలోని పర్జాంగ్ పోలీసు పరిధిలోని అఖువాపాడ పంచాయతీ, మోహన్‌పాషి గ్రామంలో గత శనివారం రాత్రి చోటుచేసుకుంది. నిందితుడిని మోహన్‌పాషి గ్రామానికి చెందిన రూపా పింగువగా గుర్తించారు. ఆయన దాడి చేసిన అనంతరం మృతదేహాన్ని కాలువలో పడేసి, నేరుగా పోలీసుల ఎదుట లొంగిపోవడం ఈ కేసును మరింత చర్చనీయాంశం చేసింది. మృతుడిని అఖువాపాడ పంచాయతీ పరిధిలోని నంబర్ 1 కాలనీ నివాసి అయిన కాశీనాథ్ బెహెరా కుమారుడు కరుణాకర్ బెహెరాగా పోలీసులు గుర్తించారు.పోలీసు వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం, మృతుడు కరుణాకర్ బెహెరా గత మూడు రోజులుగా మోహన్‌పాషి గ్రామంలో జేసీబీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆ సమయంలోనే రూపా పింగువ తన కూతురిపై కరుణాకర్ లైంగిక దాడి చేస్తున్నప్పుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఈ దృశ్యం చూసిన పింగువ తీవ్ర ఆగ్రహానికి గురై, అక్కడికక్కడే అతనిపై పదున్కైన ఆయుధంతో దాడి చేశాడు. ఈ దాడిలో కరుణాకర్ బెహెరా తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు తెలిపారు. తన కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడుతుండగా పట్టుకుని, ఆ యువకుడిని కొట్టి చంపడం ఈ ప్రాంతంలో భయాందోళనలను, కలకలాన్ని సృష్టించింది.దాడి జరిగిన వెంటనే, నిందితుడు రూపా పింగువ మృతదేహాన్ని కాలువ దగ్గర పడేశాడని, అనంతరం దాదరఘాటి పోలీస్ అవుట్‌పోస్ట్‌లో లొంగిపోయి నేరాన్ని అంగీకరించాడని పోలీసులు వెల్లడిరచారు. అయితే, ఈ ఘటనపై అనేక కథనాలు రూపుదిద్దుకోవడం ప్రారంభించాయి. ముఖ్యంగా మృతుడి తండ్రి కాశీనాథ్ బెహెరా, ఇతర బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని, పింగువ తన కొడుకుపై దారుణంగా దాడి చేసి, హత్య చేశాడని ఆరోపిస్తూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ కేసు గురించి అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి, పింగువ కుమార్తె, బాధితుడు కరుణాకర్ బెహెరా ఇద్దరూ సంబంధంలో ఉన్నారని, ఈ సంబంధం జీర్ణించుకోలేకే పింగువ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని స్థానికులు పేర్కొంటున్నారు.వివాదాలు చెలరేగుతున్న నేపథ్యంలో, స్థానిక పోలీసులు వెంటనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మృతుడు కరుణాకర్ బెహెరా, బాలిక మధ్య ఉన్న వాస్తవ సంబంధం ఏమిటి అనే కోణంలో పోలీసులు లోతుగా పరిశోధించడానికి ప్రయత్నిస్తున్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలు, ప్రేమ వ్యవహారం ఆరోపణల మధ్య గందరగోళం నెలకొనడంతో, దెంకనల్ పోలీసులు పూర్తి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కేసు తుది దర్యాప్తు ఫలితాలు, కోర్టు తీర్పు కోసం స్థానికులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మొక్కుబడిగా జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం !

ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. కఠిన




చర్యలకు ఉపక్రమించడం లేదు. గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నా కారణాలను గుర్తించి నివారణ చర్యలను పట్టించుకోవడం లేదు. ఇంతకన్నా దారుణం మరోటి కాదు. సుప్రం మొట్టికాయలు వేస్తున్నా పట్టింపు లేకుండా పోయింది. పాలకుల నిర్లక్ష్యానికి ఇంతకన్నా నిదర్శనం లేదు. మనది వ్యవసాయిక దేశం..వ్యవసాయమే మన ప్రధాన వనరు. మనకున్న భూమి, నీటి వసతులు ఎంతో విలువైనవి, సారవంతమైన నేలలు, సహజ జలవనరులు మనసొంతం. భారతదేశం అనాదినుంచి వ్యవసా యన్ని ఆధారంగా చేసుకుని ముందుకు సాగుతోంది. వ్యయసాయాన్ని నమ్ముకున్న మనం.. వ్యవ సాయాధారిత రంగాలనే ఎంచుకోవాలి. మానవులను కబళించే..ఆరోగ్యాన్ని హరించే పరిశ్రమల జోలిక వెళ్లకుండా ప్రజలు చైతన్యం కావాలి. పరిశ్రమలను కొనితెచ్చుకుని అనారోగ్యం తో జీవించడం అసవరమా అని ఆలోచించాలి. విషతుల్య పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడాలి.అవసరమైతే వాటిని మూసివేయిం చాలి. కేవలం వ్యవసాయంతో పాటు,అనుబంధ రంగాలకు మాత్రమే ప్రోత్సాహం ఇచ్చుకునేలా చూడాలి. లేకుంటే మన వనరులు కలుషితం కాగలవు. ఇప్పటికే మన నదులు కలుషితం అవుతున్నాయి. దేశంలో కాలుష్యం పెరగకుండా, కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటే తప్ప మనుగడ సాధ్యం కాదు. అయితే మధ్యలో వచ్చిన పాలకులు కక్కుర్తిపడిన ఖర్మానికి ప్రజలు కష్టాలు, నష్టాలు అనుభవించాల్సి వస్తోంది. దేశ జనాభా పెరుగుతున్నా మనకు సరైన పౌష్టికాహారం నేటికీ అదండం లేదు. ఈ క్రమంలో మనమంతా చైతన్య వంతులం అయ్యి మన సహజ వనరులు కలుషితం కాకుండా కాపాడు కోవాల్సి ఉంది. కొండలుగుట్టలను కాపాడు కోవాలి. అడవుల ను రక్షించుకోవాలి. అడవులను, కొండలను నరకడం కూడా పర్యావరణ విధ్వంసం కిందకే వస్తుంది. కాకినాడ తీరంలో మడ అడవులను నరకడంతో ఎన్నో దుష్ఫలితాలు ఎదుర్కొంటున్నాం. మట్టి కలుషితం అయినా, నీరు కలిషితం అయినా మన జీవన మనుగడ ప్రశ్నార్థకం కాగలదు. అయితే ప్రభుత్వాలు ఇబ్బడిముబ్బడి గా కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు అనుమ తులు ఇవ్వడం వల్ల మన నీను, భూమి కలుషితం అవుతోంది. పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకొవటమే కాకుండా మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలను ఇబ్బడి ముబ్బడిగా పడేయడం వల్ల సిరులు పండే నేల,జీవాధారమైన నీరు కాలుష్యమౌతుంది. వాహనాలు, పరిశ్రమలు వదిలే పొగగాలి కాలుష్యాన్ని తద్వారా ఉత్పన్నమయ్యే వేడి సమీప ప్రాంతాల జలాశయాల ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా ఉష్ణ కాలుష్యాన్నీ పెంచుతోంది. ఈ విధంగా మనం చేస్తున్న అకృత్యాల వల్ల కార్బన్ ఉద్గారం ఎక్కువ కావడం తో వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాస కోశ వ్యాధులు,వివిధ రకాల మెదడు, గుండె సమస్యలు పెరుగుతున్నాయి. వాయు కాలుష్యం పెరిగి తీవ్రమైన ఊపిరితి త్తుల వ్యాధులు, ఉబ్బసం, మెదడులో రక్తం గడ్డ కట్టడం, కంటిచూపు మందగించడం లాంటిరుగ్మతలు ఎక్కువ అవుతున్నా యని అనేక ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి. నేడు మనం నిత్యం వాడే పాలు పండ్లు కూరగా యలు కలుషితమౌతున్నాయి. అలాగే పండించే పంటలు కాష్యంబారిన పడుతున్నాయి. ఈ పదార్థాలు తినడం వల్ల కూడా విపరీతమైన ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నాం. కాలుష్యం ఫలితంగా ప్రపంచంలో మానవజాతి నయం చేయలేని భయంకర రోగాలబారిన పడి వైద్య, ఆరోగ్య రంగానికి సవాల్‌గా పరిణమిం చడం చూస్తున్నాం. అతి పారిశ్రామికీకరణ అన్నది మానవాళిని దెబ్బతీస్తుందని గుర్తించాలి. పచ్చని పంట పొలాలు విషతుల్యం అవుతాయి. ఇటీవల విశాఖలో జరిగిన గ్యాస్ లీకేజ్ ఘటన తక్కువదేమీ కాదు. ఇలాంటి పరిశ్రమలు అవసరమా అన్నది ఆలోచన చేయాలి. మనకున్న భూమిని, ప్రకృతిని కాపాడుకు నేందుకు గట్టి సంకల్పం కావాలి. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. పర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రానురాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడీతో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావ రణవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. గనుల,క్వారీల తవ్వకాలు, అడవుల విధ్వంసం, పట్టణీక రణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. గతేడాది నాటి కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జలవిపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖం డ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తి నప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంక పర్చి చుట్టుపక్కనున్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాలు చర్చకొస్తా యి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టా లు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్,బీహార్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అత్యధిక వర్షపాతం నమోదయినా నీటి

# వేతనాల్లో లింగ వివక్ష తొలగిపోయేది ఎప్పుడు!



ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో లింగ వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. కాకపోతే కాస్త ఎక్కువ తక్కువల అంతే! అయితే వివక్షను అంతానికి పాలకులు ఎప్పటిక ప్పుడు ప్రతిన బూనుతూనే ఉన్నారు. కానీ ఫలితం ఏక్కడ? అన్ని రంగాలలోనూ వివక్ష కొనసాగుతూనే ఉంది. ..అంతే బలంగా. ప్రజల సంగతి పక్కన పెడితే.. మరి ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయ్! అవి చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితికి పొంతన ఉండటం లేదు. ముఖ్యంగా వేతనాల విషయంలో తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనమన్న సూత్రం అపహాస్యానికి గురవుతోంది. వేతనాల్లో లింగ వివక్షతో పాటు సామాజిక వివక్ష కొనసాగుతోంది. ఒకే పనిచేసే ఉన్నత కులస్తులకు, అదే పని చేసే దళిత కులాలకు మధ్య వేతనాల్లో వ్యత్యాసం ఉంటుండగా, అక్కడ కూడా పురుషుల కన్నా స్త్రీలకు తక్కువ వేతనం లభిస్తోంది. తక్కువ ఆదాయం వచ్చే పనుల్లో ఈ వివక్ష చాలా ఎక్కువగా ఉంటోంది. అజీమ్ ప్రేమ్ జీ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఎంఎ÷-లారుమెంట్ విభాగం దేశ వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం నిర్ధారణ అయింది. కులం ఆధారంగా, మతం ఆధారంగా ఈ వివక్ష కొనసాగుతుంది. అధిక జీతాలు పొందే ఉద్యోగాల్లో తప్ప మిగిలిన అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి పనుల్లోనూ మహిళలకు పురుషుల కన్నా తక్కువ వేతనాలు అందుతు న్నాయి. బాగా చదువుకుని ఉన్నతస్థాయి ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు వేతనాల గురించి సంబంధిత యాజమాన్యాలతో బేరమాడే శక్తి ఎక్కువగా ఉందని, అందువల్లే ఉన్నతస్థాయిలో వివక్ష కనిపించడం లేదని ప్రేమ్‌జీ యూనివర్సిటీ చేసిన అధ్యయనాన్ని విశ్లేషించిన జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ న్యూ ఎకనమిక్స్ స్టడీస్‌లోని ఇన్‌ఫో స్పియర్ టీమ్ పేర్కొంది. ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం అధ్యయన నివేదిక, జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశ్లేషణలు 'సామాజిక గుర్తింపు భారతదేశంలో ఇంకా కీలక పాత్ర పోషిస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంలోనే కాదు. వేతనాల్లోనూ దీని ప్రభావం కనిపిస్తోంది. కొన్ని రకాల పనుల్లో కొన్ని సామాజిక వర్గాలే కనిపిస్తున్నాయి. ఆ పనుల్లో కూడా స్త్రీ, పురుష వివక్ష కనిపిస్తోంది.' అని పేర్కొన్నాయి. స్వయం ఉపాధి రంగంలో అవే పనులు చేసే పురుషుల కన్నా స్త్రీలకు 40 శాతం తక్కువ సంపాదన ఉందని ఈ సర్వేలో తేలింది. క్యాజువల్ వేజ్ ఉద్యోగాల్లో 64 శాతం, సాధారణ వేతన పనుల్లో 76శాతం ఈ వ్యత్యాసం కనిపిస్తోందని ఈ సర్వేలో తేలింది. అంటే రోజువారి వేతనాల ప్రాతిపదిక పొందే ఉపాధి పనుల్లో వివక్ష అధికంగా ఉంది. ప్రతి కులంలోనూ పురుషుల కన్నా మహిళలకు తక్కువ వేతనం లభిస్తోంది. సాధారణ వేతనాల్లో ఇలా...రెగ్యులర్ వేజ్ (సాధారణ వేతనాల) విభాగంలో ఎస్సి, ఎస్‌టిలకు నెలకు 13,735 రూపాయలు వేతనం లభిస్తుండగా, ఇతరులకు 18,005 రూపాయలు వేతనం లభిస్తోంది. ఈ విభాగంలో హిందువులకు 17,197 రూపాయలు నెలకు సగటున లభిస్తుండగా, ముస్లింలకు 13,550 రూపాయలు మాత్రమే లభిస్తున్నాయి. మొత్తంమీద పురుషులకు 17,910 రూపాయలు సగటు వేతనం లభిస్తుండగా, స్త్రీలకు 13,666 రూపాయలు దక్కుతున్నాయి. స్వయం ఉపాధి రంగంలో ...సొంతంగా ఏదోఒక పనిచేసుకుని పొట్టపోసుకునే వారి సంపాదనలోనూ అంతరాలు ఉన్నాయి. ఒకే రకమైన పనిచేస్తున్నా ఎస్సి, ఎస్‌టిలకు 8,271 రూపాయలు నెలకు లభిస్తుండ గా, ఇతరులు 11,539 రూపాయలు సంపాది స్తున్నారు. హిందువులకు సగటున 10,663 రూపాయలు లభిస్తుండగా, ముస్లింలకు 10,395 రూపాయలు మాత్రమే లభిస్తోంది. ఈ విభాగంలో పురుషులతో పోలిస్తే మహిళల సంపాదన చాలా తక్కువగా ఉంది. పురుషులు సగటున 12,099 రూపాయలు సంపాది స్తుండగా, మహిళలకు కేవలం 4,809 రూపాయలు మాత్రమే దక్కుతున్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. చిన్న వ్యాపారులు చేసుకునే మహిళలు అధిక వివక్షకు గురికావాల్సివస్తోంది. వీరికి రుణాలు లభించడం కూడా కష్టమవుతుంది. కుల,మతాలకు అతీతంగా మహిళల పట్ల ఈ వివక్ష కొసాగుతోంది.క్యాజువల్ వేతనాల్లో ...క్యాజువల్ వేతనాల విభాగంలో ఎస్సి,ఎస్‌టిలకు రోజుకు సగటున 309 రూపాయల వేతనం లభిస్తుండగా, ఇతరులకు 344 రూపాయలు లభిస్తుంది. మొత్తంమీద పురుషులకు 358 రూపాయలు వేతనం వస్తుండగా. స్త్రీలకు 230 రూపాయలు మాత్రమే లభిస్తున్నాయి. ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్నప్పటికీ మహిళలు పురుషుల కన్నా కొంత వెనుకబాటుకు గురై ఉన్నారని ఈ అధ్యయనం పేర్కొంది. తరతరాలుగా సమాజంలో పేర్కొన్న భావజాలం దీనికి కారణమని నిర్ధారించింది. మూడవ, నాల్గవ దశకంలో ముస్లింల సంపాదన హిందువుల సంపాదనలో 94 శాతంగా ఉండేదని ప్రస్తుతం అది 74 శాతానికి పడిపోయిందని నివేదిక తెలిపింది. కొన్ని పనుల్లో ముస్లింలు హిందువుల కన్నా ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్నటికీ వెనుకబాటుతనం మాత్రం ముస్లింలలోనే అధికంగా ఉందని నివేదిక పేర్కొంది. హిందు, ముస్లిం కార్మికుల మధ్య పెరుగుతున్న ఈ అంతరం ఆందోళన కరంగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వాలు ఈ వాస్తవాలను గుర్తించి ప్రభుత్వాలు చిత్త శుద్ధితో వ్యవహరించాల్సి వుంది.

# ప్రపంచ దేశాలపై మరోసారి ముడి చమురు భారం




ప్రపంచ మార్కెట్లో మరోసారి ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుత ట్రెండ్ మార్కెట్ ఎక్స్‌పర్ట్స్ అంచనాలకు భిన్నంగా ఉంది. సౌదీ అరేబియా, రష్యా, ఇతర చమురు ఎగుమతిదేశాలు(ఒపెక్) ఉత్పత్తిని తగ్గించగా అమెరికా పెంచినప్పటికీ జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 30శాతం పైగా ధరలు పెరిగాయి. ఇది ఆందోళన కలిగిస్తోంది. నిరుడు బ్యారెల్‌ధర 110 డాలర్ల వరకు వెళ్లింది. ఇక ప్రస్తుతం ప్రామాణిక బ్రెంట్ రకం ధర 90-100 డాలర్ల మధ్య దోబూ చులాడుతోంది. గత వారం 97 డాలర్ల వరకు వెళ్లింది. ఈ ఏడాది చమురుధర వందడాలర్ల మార్క్ వద్ద స్థిరపడుతుందని అంచనా. అదే నిజమైతే అభివృద్ధి చెందుతున్న దేశాలకు కష్టమే అని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. చమురు ధరల తగ్గుదల ఎగుమతి మీద ఆధారపడిన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న కారణంగా అవి ఉత్పత్తిని తగ్గించి ధరలను పెంచుకోవాలని చూస్తున్నాయి. అలాగే, అమెరికా తన వ్యూహాత్మక చమురు నిల్వల విధానంలో భాగంగా చమురునిల్వలను పెంచుకుంటోంది. ప్రస్తుతం అమెరికా చమురు నిల్వలు నాలుగు దశాబ్దాల కనిష్టానికి పడిపోయాయి. తిరిగి వాటిని నింపుతున్నప్పటికీ అవి 2021నాటి స్థాయికి మాత్రమే చేరతాయనే అంచనాలు ధరలు పెరగటానికి ఒక కారణం. ఒపెక్ దేశాలు ఉత్పత్తిని తగ్గించటం

మరొక కారణమైతే చైనాలో ఆర్థిక వృద్ధి మందగించిందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ ..అక్కడే గిరాకీ ఏర్పడనుందనే అంచనాలు కూడా చమురు ధరలు పెరగటానికి దోహదం చేస్తున్నాయి. ప్రస్తుతం అమెరికా రోజుకు పదమూడు మిలియన్ బ్యారెల్స్ చమురు ఉత్పత్తి చేస్తోంది. వచ్చే ఏడాది సగటున నెల వారీ అదే మాదిరి కొనసాగవచ్చని చెబుతున్నప్పటికీ జెపి మోర్గాన్ సంస్థ విశ్లేషకులు చమురు ధర 2026 నాటికి 150 డాలర్లకు చేరవచ్చని అంచనా వేశారు. వచ్చే ఏడాది 90 నుంచి 110 డాలర్ల మధ్య మారవచ్చు. వీరి అంచనాలను నిజం చేస్తూ.. గత వారం 93.55గా ఉన్న ధర ఉన్నట్టుండి 97 డాలర్ల వరకు వెళ్లింది. దాంతో, ఈ ఏడాది వంద డాలర్లకు మించకపోవచ్చని ఫిబ్రవరిలో వేసిన అంచనాలు తప్పుతున్నాయి. డిమాండ్-సప్లయ్ మధ్య లోటు 2025లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. 2030 నాటికి 7.1మిలియన్ల పీపాలకు పెరగవచ్చని జెపి మోర్గాన్ అంచనా. అందువలన చమురు ధరల్లో స్వల్ప ఎగుడు దిగుళ్లు తప్ప పెరిగేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గత ఏడాదిన్నర కాలంగా ధరలు తగ్గిన కారణంగా తమ లాభాలకు గండిపడుతుందనే ఉద్దేశ్యంతో కడుపు నిండిన అమెరికా చమురు సంస్థలు అసలు ఉత్పత్తినే తగ్గించి వేశాయి. ఇప్పుడు పెరుగుతుం డటంతో రిగ్గుల దుమ్ము దులుపుతున్నాయి. రష్యా చమురు ఎగుమతుల నిషేధం కొనసాగుతుందనే ధైర్యం కూడా దీనికి దోహదం చేస్తోంది. కాబట్టి, అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక వృద్ధి రేటు చమురు ధరలతో మరింత కుదేలు కావటం ఖాయం. ఆచరణలో అది సామాన్యుల మీద భరించలేని భారాన్ని మోపుతుంది. మనదేశంలోని 42 శాతం కుటుంబాలు ఆమేరకు ఇతర ఖర్చులు తగ్గించు కుంటాయని గతేడాది లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. ఇప్పటికే డాలరు విలువ పెరగటం, భారత్ వంటి దేశాల కరెన్సీల విలువలు పతనం కావటంతో చమురు కొనుగోలు భారమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలతో నిమిత్తం లేకుండా పెట్రోలు, డీజిలు మీద భారీ ఎత్తున సెస్‌లను పెంచి గడచిన తొమ్మిది సంవత్సరాలలో దాదాపు 30లక్షల కోట్ల రూపాయల మేరకు జనం మీద భారం మోపిన సంగతి తెలిసిందే. ఇక, ద్రవ్యోల్బణంతో పోలిస్తే నిజ వేతనాలు తగ్గి జనం జేబులకు చిల్లుపడింది. ఈ పరిస్థితిలో చమురు మీద పన్నులు తగ్గిస్తే జనానికి ఉపశమనం. కానీ, మోడీ సర్కార్ ఆ పనిచేస్తుందా?



# ఇండియాలోనే నెం.1గా మెగాస్టార్ చిరంజీవి 'మీసాల పిల్ల' సాంగ్..




మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మెగాస్టార్ రియల్ నేమ్‌తో వస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. భీమ్స్ సిసిరిలియో స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల' కొద్ది రోజుల క్రితం విడుదల కాగా, ఈ పాట మొదట్లో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ఇప్పుడు దేశవ్యాప్తంగా సెన్సేషన్‌గా మారింది. యూట్యూబ్‌లోనే కాకుండా అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫాంలలోనూ ఈ సాంగ్ నంబర్ వన్ ట్రెండింగ్‌లో నిలిచింది. యూట్యూబ్‌లో 30 మిలియన్లకు పైగా వ్యూస్, ఇన్‌స్టాగ్రామ్‌లో 30 వేలకు పైగా రీల్స్, 300 మిలియన్ వ్యూస్ ఇలా అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫాంలలో కలిపి 50 మిలియన్‌ం ప్లేయింగ్స్ సాధించింది. ట్రోలింగ్, మీమ్స్, నెగటివ్ కామెంట్స్ అన్నీ వచ్చినా, ఈ పాట క్రేజ్ మాత్రం ఏ మాత్రం తగ్గలేదు. పబ్లిక్‌లో బాగా పాపులర్ అవుతూ "వింటేజ్ చిరంజీవి"ను మళ్లీ గుర్తుచేస్తోందని అభిమానులు చెబుతున్నారు. 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి భీమ్స్ ఇది కెరీర్‌లోనే అతిపెద్ద ప్రాజెక్ట్. ఉదిత్ నారాయణ్ వాయిస్‌లో వచ్చిన ఈ మాస్ నంబర్ ప్రేక్షకుల్లో ఆకట్టుకుంది. చిరంజీవి డ్యాన్స్ మూవ్స్, నయనతార స్క్రీన్ ప్రెజెన్స్, అనిల్ రావిపూడి మాస్ టచ్ అన్నీ కలసి ఈ పాట అందరి దృష్టిని ఆకర్షించేలా చేశాయి. సోషల్ మీడియాలో కొంతమంది ఈ పాటను "సీరియల్ సాంగ్" అంటూ ట్రోల్ చేసినా, అభిమానులు మాత్రం "చిరు స్టైల్ మాస్ ఎంటర్టైనర్" అంటూ సపోర్ట్ చేస్తున్నారు. ఈ సాంగ్ క్రేజ్ కారణంగా సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఆయన షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. చిరంజీవి %-% వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చే సీన్‌లపై భారీ హైప్ ఉంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "2026 సంక్రాంతి కానుకగా వస్తున్నాం"లి అంటూ టీమ్ ఇప్పటికే ప్రకటించింది. "ట్రోలింగ్ ఎంతున్నా సరే, మెగాస్టార్ గ్రేస్‌ను ఆపలేరు. 'మీసాల పిల్ల' ఇండియాలో యునానిమస్ మ్యూజికల్ సెన్సేషన్‌గా నిలిచింది" అని చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

# అనుదీప్‌తో సినిమా చేస్తున్నా..

## కామెడీ చేయడం చాలా కష్టమైన పని : కయాదు లోహర్

శ్రీవిష్ణు నటించిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది అస్సామీ సుందరి కయాదు లోహర్ ఈ ఏడాది ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్రాగన్ మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ ముద్దుగుమ్మ జాతిరత్నాలు డైరెక్టర్ అనుదీప్‌తో సినిమా చేస్తుందట. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. అంతేకాదు కామెడీ చేయడం ఎంత కష్టమో చెప్పింది కయాదు లోహర్. నేను అనుదీప్ డైరెక్షన్‌లో వస్తోన్న ఓ సినిమాలో నటిస్తున్నా. ఈ మూవీ పూర్తిగా కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. సినిమాలోని చాలా డైలాగ్స్ షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతీ ఐదు నిమిషాలకోసారి వచ్చే సీన్ కొత్తగా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. కామెడీ చేయడం చాలా కష్టమైన పని. ఎందుకంటే నేను అనుదీప్ సార్‌తో ఓ సినిమా చేస్తున్నా. కామెడీ చాలా కష్టమని తెలుసుకున్నా. ఎందుకో నాకు తెలియదు కానీ దానికి భాష కూడా ముఖ్యమే. మీకు భాష తెలిసినప్పుడు దాని అర్థమేంటో.. ఆ సంస్కృతి ఏంటో మీకు తెలుస్తుంది. తద్వారా కామెడీ కూడా సహజంగానే వస్తుంది. సంస్కృతితోపాటు ప్రేక్షకుల నాడి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పని. అది షూటింగ్ చేసేటప్పుడు చాలా చాలా కష్టంగా ఉంటుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరైన విధంగా వచ్చేలా చూసుకోవాలి. కామెడీ అనేది స్క్రిప్ట్‌పై ఆధారపడే కాకుండా స్పాట్‌లో ఆయన (అనుదీప్)చాలా డైలాగ్స్‌తో రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే మళ్లీ ఐదు నిమిషాల తర్వాత మరో డైలాగ్ వస్తుంటుంది. ఈ సంభాషణలు, కామెడీ ప్రతీ సారి కొత్తగా మారుతూనే ఉంటాయి. ఒక నా భాష (అస్సామీ)లో కామెడీ చేస్తే అంత కష్టం కాదు. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం అంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ అనుదీప్ కయాదు లోహర్‌ను ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కయాదు లోహర్ 2021లో ముగిల్‌పేట అనే కన్నడ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళంలో పాథోన్‌పథం నూట్టుండు సినిమాలో నటించిన ఈ బ్యూటీ అనంతరం శ్రీ విష్ణు సరసన 'అల్లూరి' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మరోవైపు మరాఠీలో కూడా నటించింది.

# పద్మవ్యూహాన్ని ఛేదించిన పార్థుడు



అగ్ర హీరో ప్రభాస్ నటిస్తున్న పాన్ ఇండియా వార్ డ్రామా 'ఫౌజీ'. స్వాతంత్రోద్యమ నాటి ఈ కథలో ఆయన సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నది. దీపావళి సందర్భంగా ఈ చిత్రం తాలూకు కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. రైఫిల్స్ క్లస్టర్ నడుమ ప్రభాస్ నిలబడి ఉన్నట్లుగా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. యుద్ధరంగంలో ఒక్కడుగా నిలిచిన వీర సైనికుడిని స్ఫురింపజేసేలా ఈ పోస్టర్‌ను తీర్చిదిద్దారు. 'అతను పద్మవ్యూహాన్ని జయించిన పార్థుడు' అనే క్యాప్షన్ ప్రభాస్ క్యారెక్టర్ తాలూకు పవర్‌ను సూచించేలా ఉంది. ఈ నెల 23న ప్రభాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికరమైన అప్‌డేట్‌ను వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది. అనుపమ్‌ఖేర్, మిథున్‌చక్రవర్తి, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సుదీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: అనిల్ విలాస్ జాదవ్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

# సరస్వతిగా వరలక్ష్మి

వరలక్ష్మి శరత్‌కుమార్ తన కెరీర్‌లో మరో అడుగు ముందుకేశారు. స్వీయ దర్శకత్వంలో తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి ఆమె ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా పేరు 'సరస్వతి'. శనివారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని విడుదల చేశారు. హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్ పాత్ర ఊహలకు అందని విధంగా ఉంటుందని, ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. ప్రకాశ్‌రాజ్, ప్రియమణి, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ప్రవీణ్ డేనియల్, నిర్మాణం: దోస డైరీస్.




Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# నర్సింహులపేట కల్లుగీత కార్మిక సంఘ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



తొవ్వ, నర్సింహులపేట. అక్టోబర్. 21:

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో కల్లు గీత కార్మిక సంఘం ఐదో మండల మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న హైజరై వీరి ఆధ్వర్యంలో మండల కల్లుగీత కార్మిక సంఘ నూతన కమిటీని ఏకగ్రీవం చేశారు.అధ్యక్షులుగా డొనికెని రామన్న, ప్రధాన కార్యదర్శిగా చిర్ర సతీష్, ఉపాధ్యాక్షులుగా గుండగాని వెంకన్న, కోశాధికారి దొంతు రాంమూర్తి, సహాయక కార్యదర్శిగా చలమల్ల వెంకన్న, గౌరవ అధ్యక్షులుగా చలమల్ల యాదగిరి, సోషల్ మీడియా కన్వీనర్ గా కోల యాకయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రతి సొసైటీకి 5 ఎకరాలు భూమి ఇవ్వాలని, పెండింగ్ ఎక్ష్రేషియ విడుదల చేయాలని, గీతా వృత్తి రక్షణ కోసం 500 కోట్లతో కార్పోరేషన్ ఏర్పాటు చేసి గీతా వృత్తి చేసే ప్రతి కార్మికునికి మోటార్ బైక్, 50 ఏండ్లు నిండిన కార్మికులకు పెంచన్, గీతా కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు డొనికెన రామన్న మాట్లాడుతూ నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపుతు, కల్లుగీత కార్మిక సంఘం హక్కుల సాధన కోసం పోరాడతానని గీతా కార్మికుల ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారు గునిగంటి మోహన, గౌడ కుల అధ్యక్షులు డొనికెన జంపన్న, సీతారాములు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు




యాదాద్రి జిల్లా: వలిగొండ :తొవ్వ ప్రతినిధి :అక్టోబర్ 21

వలిగొండ మండల పరిధిలోని ఏదుల్లగూడెం, మాందాపురం, అక్కంపల్లి,నాతాళ్లగూడెం గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసే వెంటనే ట్యాబ్ లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలు ఎంత ముఖ్యమో రైతులకు వారి అకౌంట్లో డబ్బులు వేయడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని మండలంలో పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టియూఎఫ్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బందెల ఇంద్ర కుమార్ నామినేషన్

యాదాద్రి జిల్లా బీరామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 21

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరపున జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగాబందెల ఇంద్ర కుమార్ (ఇంద్రన్న) నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం పిలుపునివ్వగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న,రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ కె. చాంద్,రామన్నపేట మండల అధ్యక్షులు నోముల శంకర్,జిల్లా నాయకులు బోగారం మాజీ ఉపసర్పంచ్ ఎండి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండలంలో ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్

**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :అక్టోబర్ 21**




రామన్నపేట మండలంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో పల్లె దవఖానాను సందర్శించి ఎంత మంది సిబ్బంది వున్నారు.ప్రతి రోజు సమయానికి విధులకు వస్తున్నారా లేరా, రోగులకు సరిపడా మందులు ఉన్నాయా, లేవా,గత నెలలో ఎన్ని ఈడిడి లు వున్నాయి. ఈ నెలలో ఎన్ని వున్నాయి.ఇప్పటివరకు అయినవి ఎన్ని, ఎక్కడ డెలివరీ జరిగాయి అని అడిగి తెలుసుకున్నారు.తరువాత అదే గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మరియు బోగారంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి రైతులతో



మరియు అధికారులతో మాట్లాడారు. తదుపరి మండలంలో నిర్మాణంలో వున్న ఇందిరమ్మ ఇండ్ల పనులకు సంబంధించి నిర్మాణ స్థితిగతులను,నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి,ఎమ్ పిడివో ఏ. రాములు, ఎమ్ పివో, జిపివో, ఐకెపి ఏపిఎమ్,పిఏసిఎస్ చైర్మన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యానాయక్



తొవ్వ, దంతాలపల్లి, అక్టోబర్. 21

మండలంలోని సాయి బాలాజీ గార్డెన్స్ లో మంగళవారం పాలకుర్తి గ్రామానికి చెందిన గారే భవాని- రాంబాబుల కుమార్తె చి"సాక్షికరాం కు పుట్టినరోజు వేడుక మహోత్సవ కార్యక్రమానికి డోర్నకల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డి ఎస్ రెడ్యానాయక్ బి ఆర్ ఎస్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయనతో పాటు ఓలాద్రి మల్లారెడ్డి, ధర్మవరపు వేణు, నాగిరెడ్డి వెంకట్ రెడ్డి, వీరబోయిన కిషోర్ తో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి.

### -నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చేరుకుపల్లి నరేందర్.

బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 21.



దీర్ఘకాలిక లక్ష్యాలతో యువత రాజకీయాల్లోకి రావాలని బయ్యారం మండల కేంద్రానికి చెందిన ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకుపల్లి నరేందర్ యువతకు సూచించారు. విద్యావంతులు సైతం రాజకీయాల్లో వస్తున్నారని,ఇది స్వాగతించాల్సిన విషయమని అన్నారు.ఎన్నికలప్పుడే కష్టపడితే రాజకీయాల్లో రాణించలేమని చెప్పారు. ప్రజాప్రతినిధులకు హాలీడేస్ ఉండవని, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటేనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు.ఇదే లక్ష్యంతో పని చేసి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా సక్సెస్ అయ్యానని తెలిపారు.రాజకీయాల్లో పదవులతో వ్యక్తిత్వం పెరగదని ఆయన అభిప్రాయపడ్డారు.చేసిన అభివృద్ధి పనులతో పాటు మన ప్రవర్తన, ప్రజలతో నడుచుకొనే విధానంతో గుర్తింపు తెస్తుందని చెప్పారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో యువత పాత్ర మరువలేనిదని,వచ్చే స్థానిక సంస్థలఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చెయ్యడానికి యువత ముందుకు వచ్చి పోటీ చెయ్యాలని,అలాగే కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థుల గెలుపుకై యువత ముందుకు వచ్చి కృషి చెయ్యాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను లోటు బడ్జెట్ ఉన్న నెరవేరుస్తూ ముందుకు వెళ్తుందని అన్నారు.ఆదాయ వనరులు పెంచుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి అద్భుతమైన పాలన దక్షతతో రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు వచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు.

## గ్రూప్-1 ర్యాంకర్లను సన్మానించిన ఎమ్మెల్యే నాయిని..

తొవ్వ ,ప్రతినిధి బాలసముద్రం/హనుమకొండ

ఇటీవల తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ɔGPSC) విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో హనుమకొండ జిల్లాకు గర్వకారణంగా నిలిచిన అభ్యర్థులను ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ,ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారుఈ సందర్భంగా గ్రూప్-1లో ప్రతిభను చాటిన శ్రీ బండారి అన్వేష్ (%DSP%), సంఘాల జశ్వంత్ రాజ్ (DSP), పోతరాజు పవన్ (మునిసిపల్ కమిషనర్) లను ఎమ్మెల్యే వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ హనుమకొండ జిల్లాకు చెందిన మేధావులు అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయం సాధించడం గర్వకారణం.ఇది యువతకి స్ఫూర్తిదాయకం. భవిష్యత్ లో యువతి యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షలలో నియోజకవర్గం నుంచి విజయం సాధించాలని అభిలాషించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతకు అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఉద్యోగ నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందుకోవడం మరింత గౌరవమైన విషయం అని ఎమ్మెల్యే పేర్కొన్నారుపేద ప్రజలకు న్యాయం అందేలా,సమాజ అభివృద్ధికి పాటు పడాలని ఆకాంక్షించారు,



## కాపాస్ కిసాన్ యూప్ పై అవగాహన కల్పించిన

### మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్

తొవ్వ, నర్సింహులపేట, అక్టోబర్. 21బీ

మండలంలోని జయపురం, బాసు తండా మరియు బక్క తండా గ్రామాలలో పంట పొలాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ పరిశీలించడం జరిగింది. అనంతరం రైతులకు భారత ప్రభుత్వం పత్తి కొనుగోలు కోసం నూతనంగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు వివరించడం జరిగింది. వారి యొక్క స్మార్ట్ ఫోన్లో యాప్ ను ఇన్స్టాల్ చేసి దానిలో స్లాట్ బుకింగ్ గురించి వివరించడం జరిగింది. మరియు జయపురం గ్రామంలో మొక్కజొన్న పంటను విత్తనం వేసే పద్ధతిని మరియు విత్తనశుద్ధి గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

## నివాళులర్పించిన ఎమ్మెల్యే లు నాయిని,నాగరాజు...

తొవ్వ ,ప్రతినిధి హనుమకొండ, అక్టోబర్ 21:



హనుమకొండ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నేడు పోలీస్ స్మృతి పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కే.ఆర్. నాగరాజు గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు శ్రీమతి స్నేహ శబరీష్, శ్రీమతి సత్య శారద, వరంగల్ నగర కమిషనర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్, ఎన్పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వరుణ్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరులైన పోలీస్ అధికారులకు నివాళులు అర్పించగా, అమరవీరుల కుటుంబాలను గౌరవిస్తూ వారికి బహుమతులు అందజేశారు.అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్ నుంచి అశోక జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యేలు, అధికారులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు %జు ఎ% శ్రీనివాస్ రావు,పోలీస్ ఉన్నతాధికారులు,అమరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు

### అమరుల త్యాగాలు మరువలేనివి

### ఎస్ హెచ్ ఓ సురేష్




తొవ్వ, నర్సింహులపేట, అక్టోబర్. 21

మండల కేంద్రంలో పలుసంఘాల నాయకుల కలసి స్టేషన్ హౌస్ ఆఫిసర్ మాలోతు సురేష్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్బంగా మంగళవారం సాయంత్రం మండలకేంద్రంలోని చౌరస్తా నుండి అంబేద్కర్ సెంటర్ వరకు క్రొవత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరవీరులకు క్రొవత్తులు వెలిగించి అంబెద్కర్ సెంటర్ లో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ హెచ్ ఓ సురేష్ మాట్లాడుతూ శాంతి



భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని అన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా.విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం జరిగింది. వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. విరామం లేకుండా అనునిత్యం పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా జిల్లాలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో అలాగే.అకాల వర్షం వచ్చినప్పుడు. తదితర సందర్బలల్లో కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ సురేష్ కానిస్టేబుల్లు రవికుమార్,మమత, అజిత్, ప్రవీణ్, జోగేందర్ సింగ్, ఉష, నయీమ్ పాషా లతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్, పలు సంఘాల నాయకులు మందుల యాఖుబ్, ఎర్ర దిలీప్ కుమార్, పటేల్ రామన్న, బానోత్ సురేష్, బండి రమేష్, ఇసంపెల్లి అనిల్, చౌడవరపు శ్రీనివాస్, గుండాల బిక్షం, ఎర్ర వెంకట్రామనర్సయ్య, దాసరోజు వెంకటేశ్వర్లు, గుద్దేటి శంకర్, లచ్చు నాయక్, క్రీడాకారిణి చందు లావణ్య, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు నెలకుర్తి వీరారెడ్డి, డి ఎస్ రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఎమ్మెల్యే సీతక్క నివాళి

### - శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పడుతున్న కష్టాన్ని కొనియాడిన నాయకురాలు



హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) దానసరి సీతక్క పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీసుల సేవలకు, త్యాగాలకు నివాళులు అర్పించారు. సమాజ శ్రేయస్సు కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ జీవితాలను పణంగా పెట్టి, నిస్వార్థ అంకితభావంతో రేయింబవళ్లు శ్రమిస్తున్న పోలీసులను ఆమె ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు. పోలీసులు తమ విధులను అత్యంత ధైర్యంతో నిర్వర్తిస్తారని, సమాజంలో శాంతి, భద్రతలను కాపాడటం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయరని ఎమ్మెల్యే సీతక్క పేర్కొన్నారు. వారి ఈ నిస్వార్థ సేవ, సాహసం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆమె తెలిపారు. పోలీసుల నిరంతర కృషి వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాన్ని తాము సెల్యూట్ చేస్తున్నామని సీతక్క తెలిపారు. వారి కుటుంబాలకు, అమరవీరుల జ్ఞాపకాలకు తమ ప్రగాఢ గౌరవాన్ని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసుల త్యాగం అజరామరం అని, వారి సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఆమె ఉద్ఘాటించారు.ఈ సందేశం ద్వారా ఎమ్మెల్యే దానసరి సీతక్క, పోలీసుల పాత్రను, వారి త్యాగాన్ని గుర్తించినట్లుగా నిలిచింది. రాష్ట్రంలోశాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న పోలీసు బలగాలకు మద్దతుగా నిలబడాల్సిన ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

## బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో దీపావళి పూజ వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 21:



దీపావళి సందర్భంగా, హైదరాబాద్, కాచిగూడ లోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు నేతృత్వంలో సాంప్రదాయ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.శాంతి, అందరి శ్రేయస్సు కోసం దైవిక ఆశీస్సులను కోరుతూ ఈ వేడుకను భక్తి, ఉత్సాహంతో నిర్వహించారు. ఉమా బిరాదర్, కృష్ణవేణి, ప్రియ, ప్రభు, సునీల్ కె, రాజ్ కుమార్, శ్రీనివాస్ గుప్తా, నరేష్ మరియు ఇతరులు సహా బజరంగ్ సేన తెలంగాణ సభ్యులు, మద్దతుదారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ ఆనందకరమైన దీపాల పండుగ సందర్భంగా పాల్గొనేవారు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, ఐక్యత, పండుగ స్ఫూర్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా, శ్రీ ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు తెలంగాణ ప్రజలకు తన హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం నిజమైన సారాన్ని ప్రతిబింబిస్తూ, ఐక్యత, సామరస్యం, సమాజ సేవ స్ఫూర్తితో పండుగను జరుపుకోవడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.సామూహిక పురోగతి, సామాజిక సామరస్యం మరియు రాష్ట్రం, దేశం యొక్క నిరంతర శ్రేయస్సు కోసం ప్రార్థనలతో కార్యక్రమం ముగిసింది.

## “తెలంగాణ రైజింగ్ - 2047 “ సిటిజన్ సర్వే లో అందరూ పాల్గొనాలి

### ఈనెల 25 తో ముగియనున్న సర్వే

### జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్.




తొవ్వ మహబూబాబాద్ అక్టోబర్ 21 :

తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన “తెలంగాణ రైజింగ్ - 2047 “ సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారని జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం “తెలంగాణ రైజింగ్ - 2047 “ సిటిజన్ సర్వేను చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుందని, ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున %ఊఊ.వశ్రీఖఅస్త్రుఖ్మ.స్త్రశీఙ.ఱఅ/వశ్రీఖఅస్త్రుఖ్మతీఱం-ఱఅస్త్ర% అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సిందిగా అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అదుపుతప్పిన గ్రైనేట్ లారీ తృటిలో తప్పిన భారీ ప్రమాదం

### డ్రైవర్ , క్లినర్ సీరియస్ ఖమ్మం ఆసుపత్రికి తరలింపు ,



తొవ్వ ,తోఉరు ,అక్టోబర్ 21

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో గ్రైనేట్ లోడుతో వెళున్న లారీ ప్రమాదానికి గురైంది ఈ ఘటనలో లారీ డ్రైవర్ క్లీనర్ను గాయాలు కాగా పుట్టగొట్టిన కం ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు ఈ ఘటనలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలు రోడ్డుపై నిత్యం వస్తున్న జిల్లా రోడ్డు భద్రతాధికారులు కనీసం పట్టించుకోవడంలేదని హెవీ వెళ్తూ రోడ్లను డ్యామేజ్ చేయడం కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని పలువురు ప్రజా సంఘం మేధావులు అన్నారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు

# మీ త్యాగం మరువలేనిది

## ప్రజల ధన, మాన ప్రాణ రక్షణలో పోలీసుల అంకిత భావం

### జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపియస్.



**పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయం లో స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘన నివాళి..**

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 21:**

మీ త్యాగం మరువలేనిది

ప్రజల ధన, మాన ప్రాణ రక్షణలో పోలీసుల అంకిత భావం విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు గుండెలో నిలిచిపోతాయని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కెకెన్ అన్నారు , మంగళవారం పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయం లో స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు ..

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... 21 అక్టోబర్ 1959 వ సంవత్సరం లో సి.ఆర్.పి.యఫ్ - ఎస్.ఐ కరమ్ సింగ్ నాయకత్వంలోని 20 మంది భారత జవాన్లు లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా చైనా ఆర్మీ మన ఆర్మీ పై దొంగ దాడి చేసి 10 మందిని జవాన్ లను హతమార్చిందని, ఆ రోజు నుండి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా (పోలీస్ ఫ్లాగ్ డే) గా నిర్వహిస్తున్నం అన్నారు ఒక్కొక రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన సమస్యలు ఉండేవి మన రాష్ట్రంలో గతంలో నక్సలిజం ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఆ సమయంలో ఎంతో మంది జవాన్లను కోల్పోవడం జరిగిందని, పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛతీస్ ఘడ్ మరియు అస్సాం వంటి కొన్ని నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలలోనూ అనేక మంది జవాన్లను కోల్పోవడం జరిగిందన్నారు. జమ్ముకాశ్మీర్ లాంటి రాష్ట్రాలలో పాక్ ప్రేరిపిత ఉగ్రవాదులతో ఎంతో మంది పోలీసులు, ఆర్మీ జవాన్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉగ్ర మూకలను హతమార్చి, తమ తనువులను చాలించారని, ఆనాటి వారి ప్రాణత్యాగల వలననే మనం ఈ రోజు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నాం అన్నారు. ఈ సంవత్సరంలో మన దేశంలో విధినిర్వహణలో 191-మంది జవాన్లు వీరమరణం పొందారని, ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 5- మంది ఉన్నారు. వీరమరణం పొందిన వారి ప్రాణత్యాగాలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని, ఆనాటి వారి ప్రాణత్యాగల వలననే నేడు మనందరం సుఖ:సంతోషాలతో ఉండగలుగుతున్నాం అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితిలలోనైనా పోలీసు శాఖ ఎదురు నిలబడి, పోరాడటం జరుగుతుందని, అలాంటి పోలీసుల సేవలు మనందరి మదిలో చిరస్మరణీయం అన్నారు. గత జూన్ నెలలో జరిగిన సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శిథిలాల క్రింద చిక్కుకు పోయిన మృతదేహాలను వెలికి తీసి, తమ ధైర్య సహసాలను చాటుకున్నారు అన్నారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అన్నారు.



పోలీస్ అమరుల కుటుంబాలను ఉధ్యేశించి మాట్లాడుతూ.. వారి కుటుంబాల సంక్షేమం, వారికి ఆర్థిక పరమైన ప్రయెజనాలను చేకూరేలా, వారి కుటుంబాలలో మనోధైర్యాన్ని అందించటమే పోలీసు అమరవీరులకు అందించే నిజమైన నివాళి అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్య పరుస్తూ.. పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని



చేస్తుందన్నారు. అమరవీరులు అయిన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు తిరుపతి రావు, కృష్ణకిషోర్, గంద్రతి మోహన్, ఏ.ఆర్ డిఎస్పీలు శ్రీనివాస్, విజయప్రతాప్, సీఐలు, ఆర్.ఐలు ఎస్.ఐ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# మత సామరస్యానికి ప్రతీకగా పెనుగొండ ఆటో యూనియన్ - సమ్మయ్య గౌడ్

## పెనుగొండ ఆటో యూనియన్ నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి చిలువేరు చిరు విరాళం

## దేవాలయం చుట్టూ స్టీల్ ఫెన్సింగ్ కు 20వేల రూపాయలు అందించిన సమ్మిగౌడ్

## మైసమ్మ తల్లి దీవెనలతో ప్రతి ఒక్కరూ క్షేమం: ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ ఆసిఫ్

తొవ్వ ,కేసముద్రం ,అక్టోబర్ 09:

కేసముద్రం గ్రామం పెనుగొండ ఆటో యూనియన్ మత సామరస్యానికి ప్రతీకగా,నిలిచిందని ఆటో డ్రైవర్లకు, ప్రయాణీకులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీవిస్తూ మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణం చేపట్టడం చాల సంతోషకరమైన విషయం అని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు , మంగళవారం ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ ఆసిఫ్ మైసమ్మ గుడి విరాళం కోసం విజ్ఞప్తి చేయగా చిలువేరు చిరువిరాళం ప్రకటించి అందించారు ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామంలో ఆటో కేంద్రం వద్ద ఉన్న మైసమ్మ తల్లిని చెట్టు కింద కొలిచేవారమని, అనంతరం ఆటో డ్రైవర్ల సహకారంతో రేకుల షెడ్డుతో నీడను ఏర్పాటు చేసినప్పటికీ అందరినీ





కంటికి రెప్పలా కాపాడుతూ మైసమ్మ తల్లికి శాశ్వత ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించి ఆటో డ్రైవర్లు, గ్రామ పెద్దలు, మండలం లోని ప్రజా ప్రతినిధుల సహకారాన్ని కోరామని తెలిపారు. అడగగానే స్పందించి ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే స్టీల్ ఫెన్సింగ్ కు మండల కాంగ్రెస్ నాయకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ రూ..20 వేల ఆర్థిక సహాయం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు..మామూలుగా ఆలయాలను హిందువులు మాత్రమే నిర్మిస్తారని కానీ అందుకు భిన్నంగా హిందు, ముస్లీం తేడాలు లేవని దేవుడు ఎవరికైనా ఒక్కరేనని విశ్వాసం వ్యక్తం చేస్తూ మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం సోదరులు ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందించదగ్గ విషయమని, అలాంటి వారితో నేను సైతం ఉండాలని, మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణంలో తనకు భాగస్వామ్యం కల్పించిన పెనుగొండ ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ ఆసిఫ్, ఇతర సభ్యులకు సమ్మయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు షేక్ ఇమామ్ పాషా, తాటి వీరన్న,నాంచారి శ్రీను,ఈసాల లక్ష్మయ్య, కొండ బత్తుల నరేష్, దేవరపు వెంకన్న,తాటి ఉపేందర్,ముత్యం వెంకన్న బొమ్మర మల్లయ్య,షేక్ మదార్, తాటి కుమారస్వామి, షేక్ ఇమ్రాన్,షేక్ అమీర్, చిన్నబోయిన వీరన్న, పూణెం సంతోష్,కల్తీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు..


# బంగాళాఖాతంలో వాయుగుండం

**- తెలంగాణలో ఐదురోజులు భారీ వర్షాల హెచ్చరిక**

**- ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనంబీ పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్**



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నేటి ఉదయం (మంగళవారం) అల్పపీడనంగా బలపడింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకుని ఉన్న నైరుతి, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వాయుగుండం ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు పయనించి, తరువాతి 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.





# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## పాలకుర్తి మండలంలో రైతులకు విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొవ్వ ,పాలకుర్తి , అక్టోబర్ 21:

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు , మంగళవారం పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి మండల కేంద్రంలో రైతు వేదిక ప్రాంగణంలో జాతీయ స్థాయిలో అమలు అవుతున్న జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్ (ప్యాడీ) మరియు జాతీయ నూనెగింజల మిషన్ (గ్రౌండ్‌నట్) కార్యక్రమాల కింద రైతులకు విత్తనాలను పంపిణీ కార్యక్రమాన్ని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షైక్ తో కలిసి పంపిణి చేశారు , ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రైతు దేశానికి వెన్నెముక. రైతు బలంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. అందుకే ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు మద్దతుగా నిలుస్తోంది," అని వారు పేర్కొన్నారు. రైతులు పండించే ప్రతి గింజకు విలువ దక్కేలా చర్యలు తీసుకుంటామని యశస్విని రెడ్డి గారు హామీ ఇచ్చారు. నాణ్యమైన విత్తనాల పంపిణీతో పాటు వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా దిగుబడులు పెంచడం లక్ష్యమని తెలిపారు.




అలాగే రైతులు ఈ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, మద్దతు ధరలు, మరియు సాంకేతిక సాయం ద్వారా తమ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి రైతు సంతోషంగా, స్వావలంబిగా ఉండడం నా లక్ష్యం. రైతులకు అవసరమైన సహకారం అందించడానికి ఎల్లప్పుడూ నేను ముందుంటాను. రైతు కష్టానికి గౌరవం దక్కేలా కృషి చేస్తాం," అని అన్నారు. ఈ కార్యక్రమంలో %రూవీజ% చైర్మన్ లవుడ్యా మంజుల భాస్కర్, బ్లాక్ మరియు మండల అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు నాగన్న, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు..




# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొవ్వ ,పెద్దవంగరా ,అక్టోబర్ 21:

పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండల కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే ప్రారంభించారు..ఈ సందర్భంగా గ్రామ రైతులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. రైతులు పండించిన పంటను పరిశీలించి, కొనుగోలు కేంద్రాల సదుపాయాలను ఎమ్మెల్యే సమీక్షించారు..రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. వరి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు జరగాలి. రైతులను ఎవరైనా ఇబ్బంది పడితే వెంటనే సమాచారం ఇవ్వాలి. ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదు, అని కఠిన హెచ్చరిక జారీ చేశారు. అలాగే,



ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు, తేమ శాతం కొలిచే పరికరాలు సక్రమంగా పనిచేయాలని, చెల్లింపులు సమయానికి జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయి. రైతు సంతోషంగా ఉండడమే తెలంగాణ అభివృద్ధికి మూలం, అని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, వ్యవసాయ మరియు రెవెన్యూ అధికారులు, ప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు